

రెండో రోజు రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో మాట్లాడుతున్న సదానందం

## నాటకం మనిషి జీవితానికి దర్పణం

వరంగల్, జూన్ 10 : నాటకం ప్రతి మనిషి జీవితానికి దర్పణంగా నిలుస్తుందని తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం అన్నారు. నగరంలోని పోతన విజ్ఞాన పీఠంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి నాటక పోటీలకు రెండవ సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిజ జీవితంలోని ఘటనలను కల్పిత పాత్రలతో చేప్పేదే నాటకం అని అన్నారు. కాళోజీ కళాక్షేత్రాన్ని నాటకాలు వేసే విధంగా నిర్మించాలన్నారు. నాటక నటీనట సంక్షేమ సమాఖ్య పాలకోల్లు ఆధ్వర్యంలో 'అనూహ్యం' నాటికను ప్రదర్శించారు. కాకతీయ కళా సమితి హుజూరాబాద్ ఆధ్వర్యంలో 'వీలునామా' నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో కాజీపేట తిరుమలయ్య, ఎన్ఎస్ఆర్ మూర్తి, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, గడ్డం యుగేంధర్ గౌడ్, వేముల ప్రభాకర్, సాదుల సురేశ్, విజయరాజ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గ్యారెంటీలు అమలు చేయాలని ధర్నా

ఖిలా వరంగల్, జూన్ 10 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో ఖిలావరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి జగదీశ్వర్, జిల్లా కార్యదర్శి నర్ర ప్రతాప్ మాట్లాడుతూ వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, ప్రతి మహిళకు రూ.2500, రూ.500కు గ్యాస్ సిలిండర్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, కార్మికులకు ఏడాదికి రూ.12 వేలతో పాటు తదితర వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలన్నారు. అలాగే గృహ నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు అందించాలని, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆర్ ఐలయ్య, నల్గొండ రవి, ప్రభాకర్, నర్సయ్య, రాజు పాల్గొన్నారు.

## 'కారా' అన్యాయంపై అధికారుల విచారణ

రాయపర్తి, జూన్ 10 : సంతానం భాగ్యానికి నోచుకోని ఓ దంపతులకు ఐదేళ్లుగా 'కారా సంస్థ' (సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) చేసిన అన్యాయంపై సోమవారం పలు శాఖల అధికారుల బృందం క్షేత్ర స్థాయిలో విచారణ జరిపారు. కాగా, దీన్ని స్థానిక ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా సత్యవతి గుట్టుచప్పుడు కాకుండా ముగించేందుకు ప్రయత్నించినట్లు బాధిత కుటుంబ సభ్యులు విలేకరులకు తెలిపారు. బాధితుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మొరుపోజు సవిత-రాంబాబు దంపతులకు సంతానం కలుగకపోవడంతో 2019 ఫిబ్రవరి 9న జిల్లా కేంద్రంలోని శిశు గృహలో తాము పిల్లలను దత్తత తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలుపుతూ దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల మేరకు కొంత సొమ్ము డీడీల రూపంలో సంస్థకు చెల్లించి, అడిగిన పత్రాలను సమర్పించారు. అయితే, ఐదేళ్లు గడిచినా సదరు సంస్థ పిల్లలను అందించకపోవడంతో అనుమానం వచ్చి బాధితులు ఆరా తీశారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే కారా అధికారుల బృందం తమకు పిల్లలు అవసరం లేదని రాసిచ్చినట్లు కారా లాగిన్‌లో నమోదు చేసి దరఖాస్తును తిరస్కరించినట్లు బాధితులు వివరించారు. ఈ విషయంపై తాము ఇటీవల ఆందోళన నిర్వహించగా సోమవారం డీడబ్ల్యూవో ఈవో రేణుక, ఐసీపీఎస్ రాజు, వరంగల్ అర్బన్ సీడీపీవో ఈశ్వజ, నర్సంపేట ఏసీడీపీవో శ్రీదేవి, వర్ధన్నపేట సీడీపీవో డేబోరా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతితో కూడిన బృందం విచారణకు వచ్చినట్లు తెలిపారు. వారు తమ విచారణలో నమోదైన అంశాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మండలంలోని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పనితీరుపై మండలవ్యాప్తంగా ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

## చదువు, క్రీడల్లో రాణిస్తున్న 'బ్రిలియంట్' విద్యార్థులు

కరీమాబాద్, జూన్ 10 : ఎస్ఆర్ఆర్ తోటలోని బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లలోని ప్రతిభను గుర్తిస్తూ నిష్ణాతులైన గురువులతో శిక్షణ అందించడం ద్వారా విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణతతో పాటు రాష్ట్రస్థాయిలో పలు అవార్డులను పొందారు. అబాకస్, ఐఐటీ, ఉపన్యాస పోటీలతో పాటు నేషనల్ సైన్స్‌డే, పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులను పొందారు. పాఠశాల యాజ మాన్యం పూర్తిస్థాయి వసతులతో ఉత్తమ విద్యను అందిస్తోంది.



అబాకస్‌లో రాష్ట్రస్థాయి బహుమతులు పొందిన విద్యార్థులు



అవినాశ్, అకాడమిక్ డైరెక్టర్

### ఉజ్వల భవిష్యత్ అందించడమే లక్ష్యం

విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించడమే లక్ష్యంగా పాఠశాల నిర్వహిస్తున్నాం. పిల్లల్లోని ప్రతిభను గుర్తించి, అందుకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి మంచి ఫలితాలను సాధిస్తున్నాం. పిల్లల సంపూర్ణ ఎదుగుదలకు ప్రతి వారం పాఠశాలలో ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థులను ఉత్తమంగా తీర్చి దిద్దేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాం.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★Wanted Experience (M&F) Local & Kerala Teachers for Primary Hindi, English higher section Hindi Good Salary for fluent English, ELOHIM SCHOOL, Kommala, Wgl. 9390112329, 7702026999.
NTW-318919

CHANGE OF NAME

★I, GOPAGONI RAVI, S/o. GOPAGONI SAYABJILLA, R/o. H.No. 5-79, Main Road, Narmetta (V&M), Jangaon Dist., T.S., My Father Name is GOPAGONI SAYABJILLA alias SAYABJEELA is one and the same all further purposes.
NTW-5698

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565

## 'రూ.60 చెల్లించాలి'

కాశీబుగ్గ, జూన్10 : ప్రభుత్వ నిబంధనల ప్రకారం గన్నీ సంచికి రూ.60 చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్ రావు కోరారు. సోమవారం రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎనుమాముల మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చిన గన్నీ సంచులకు వ్యాపారులు పాత ధర రూ.30 చెల్లిస్తున్నారన్నారు. గన్నీ సంచికి రూ.60 చెల్లించాలని ఏడేళ్ల క్రితమే జీవో విడుదలైందన్నారు. అయినా వ్యాపారులు డబ్బులు ఇవ్వడం లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అమలు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కూస సంపత్‌కుమార్, బీ నర్సయ్య ఉన్నారు.

## ఒకరికి గాయాలు

కాశీబుగ్గ, జూన్ 10 : నగరంలోని నర్సంపేట రోడ్డుపై బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఓ పాల వ్యాపారి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే.. గీసుగొండ మండలంలోని కొనాయిమాకుల గ్రామానికి చెందిన పాల వ్యాపారి శంకర్ నగరంలో పాలు అమ్ముకొని తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో లేబర్‌కాలనీలో నర్సంపేటరోడ్డులో శాలినినగర్ వైపు వస్తున్న ట్రాక్టర్ అతడి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డుపై బోల్తాపడింది. ఈ ఘటనలో శంకర్‌కు తీవ్రగాయాలు కాగా, స్థానికులు అతడిని ఎంజీఎం దవాఖానకు తరలించారు.

# సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

### వరంగల్ కలెక్టర్ పీ ప్రావీణ్య

వరంగల్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై ఇంటింటా సర్వే పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. సోమవారం నిట్ దర్గారోడ్డులోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మొబైల్ శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జలజీవన్ మిషన్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాల మేరకు తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తుందన్నారు. ఆయా గ్రామాల్లో ఎంపీడీవోలు, ఏపీవోలు, ఏపీఎంలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్, సీసీ ఐకేపీలను సర్వే అధికారులుగా నియమించినట్లు తెలిపారు. జిల్లా మొత్తం 625 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, 323 జీపీలలో సుమారు 1, 23, 894 ఇళ్లు ఉండగా ఈ సర్వే ద్వారా జిల్లాలో మిషన్‌భగీరథ నల్లాల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. నల్లా కనెక్షన్లు చెక్ చేసి, కుటుంబసభ్యుల వివరాలు మొబైల్‌యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి ఆపరేటర్ రోజుకు 25 నుంచి 50 వరకు అప్లికేషన్లను 10 రోజుల్లో పూర్తిచేయాలన్నారు. అనంతరం మొబైల్ అప్లికేషన్‌పై మాస్టర్‌ట్రైనర్లతో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీపీవో రామిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకటరమణరెడ్డి, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిసెంట్లు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

### దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

ఖిలా వరంగల్ : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులు, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ పీ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు జిల్లా నుంచి 81 మంది తరలివచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని ఫిర్యాదు చేశారు. ఇందులో ఎక్కువగా భూ సంబంధిత సమస్యలే ఉన్నాయి. గ్రేటర్ 17వ డివిజన్ స్తంభంపల్లిలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉందని, వెంటనే పరిష్కరించాలని కలకోట్ల నాగరాజు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కాగా, రెవెన్యూ శాఖకు సంబంధించిన 55 దరఖాస్తులు, సివిల్ సప్లయ్‌వి 4, వైద్యారోగ్య శాఖ 4, సంక్షేమ శాఖ 4 తదితర శాఖలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. కాగా, రాయపర్తి మండలంలోని పన్యానాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న ఈసీ కోళ్ల ఫాం పనులను వెంటనే నిలిపివేయాలని తండావాసులు విన్నవించారు.

### ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు

పర్యావరణానికి తీవ్ర నష్టం కలగిస్తున్న సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్లాస్టిక్ నియంత్రణకు మార్పు ముందుగా జిల్లా అధికారుల నుంచే రావాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్లాస్టిక్‌ను నియంత్రించాలని, దానికి ప్రత్యామ్నాయంగా జ్యూట్ బ్యాగులు, పేపర్ కవర్లను వినియోగించాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో కౌసల్యాదేవి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సిడాం దత్తు, కృష్ణవేణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఈ నెల 19 వరకు బడిబాట

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలనే సంకల్పంతో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జిల్లాలో ఈ నెల 19 వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో బడిబాట వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈవో వాసంతి, ఎంఈవోలు పాల్గొన్నారు.

## బక్రీద్‌కు ఈద్గాలో ఏర్పాట్లు చేయాలి

కరీమాబాద్, జూన్ 10 : బక్రీద్‌ను పురస్కరించుకుని ఫోర్టురోడ్డులోని ఈద్గాను సందర్శించి ఏర్పాట్లకు అధికారులను ఆదేశించాలని మంత్రి కొండా సురేఖను ఖిలావరంగల్ ఈద్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆమెను ఈద్గా కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో చాంద్‌పాషా, అమ్జద్, హసన్‌అలీబేగ్, మగ్దూం, అష్రఫ్, మాషుఖ్ ఉన్నారు.



మంత్రి సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న ఈద్గా కమిటీ సభ్యులు

## సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ వేదిక

### గ్రేటర్ అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్

వరంగల్, జూన్ 10 : సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ వేదిక అని బల్దియా అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన వినతులు, ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అయన అన్నారు. కాగా, గ్రీవెన్స్‌లో 58 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 28, ఇంజినీరింగ్ విభాగం 22, ప్రజారోగ్య విభాగం 6, పన్నుల విభాగాలకు 2 వినతులు వచ్చాయి. ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో రాజేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, హెచ్‌వో రమేశ్, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తల్లిని చంపిన తనయుడి అరెస్ట్

శాయంపేట, జూన్ 10 : కర్రతో కొట్టి తల్లిని చంపిన కొడుకుని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. శాయంపేట పోలీస్ స్టేషన్‌లో పరకాల ఏసీపీ కిశోర్ కుమార్ వివరాలను వెల్లడించారు. కొప్పుల గ్రామానికి చెందిన మోతె తిరుపతి రెడ్డి ఈ నెల 8న భార్యను కొడుతుండగా, అతడి సవతి తల్లి అమృతమ్మ మధ్యలో జోక్యం చేసుకోగా, ఆవేశంతో అక్కడే ఉన్న మంచం కర్రతో తలపై కొట్టాడు. వెంటనే ఆమెను పరకాలకు, అక్కడి నుంచి ఎంజీఎం దవాఖానకు తరలించారు. కాగా, వైద్యులు పరీక్షించి అప్పటికే వృద్ధురాలు మృతి చెందినట్లు తెలిపారు. అయితే మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చిన తిరుపతిరెడ్డి గోడ కూలి తన తల్లి చనిపోయిందని నమ్మించేందుకు ప్రయత్నించాడు. అందులో విఫలం కావడంతో పరారయ్యాడు. మృతురాలి కుమార్తె రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తిరుపతిరెడ్డి కోసం గాలిస్తుండగా ఆదివారం హనుమకొండ బస్‌స్టేషన్‌లో గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. చలివాగు ప్రాజెక్టు శివారులో పడేసిన కర్రను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతిరెడ్డిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ రంజిత్ రావు, ఎస్సై ప్రమోద్ కుమార్ తదితరులు ఉన్నారు.

## జేఈఈ అడ్వాన్స్‌లో సైనిక్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఖానాపురం, జూన్ 10 :మండలంలోని అశోక్‌నగర్ గిరిజన సంక్షేమ సైనిక్‌స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. సైనిక్‌స్కూల్‌కు చెందిన జాదవ్ ఉదయ్‌కిరణ్ గిరిజన కేటగిరిలో 736వ ర్యాంక్, బానోత్ రాజ్ కుమార్ 1287వ ర్యాంక్ సాధించారు. అలాగే, అడవత్ చందు, పాల్తావత్ నవీన్‌కుమార్, జాదవ్ విజేందర్ నాయక్, ఇస్లావత్ ఠాగూర్ సైతం ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీనివాసస్వామి, డైరెక్టర్ కల్నల్ వై శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు అభినందించారు.



ఉదయ్‌కిరణ్



రాజ్‌కుమార్

## పాలిటెక్నిక్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభం

### 14వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు

హనుమకొండ చౌరస్తా, జూన్ 10 : డిప్లొమా పూర్తయిన విద్యార్థులు ఇంజినీరింగ్ 2వ సంవత్సరంలో ప్రవేశం కోసం కౌన్సెలింగ్ ప్రక్రియ వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సోమవారం ప్రారంభమైంది. 11వ తేదీలోగా స్లాట్స్ ఎంచుకున్న వారికి 12వ తేదీ వరకు ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్‌లో సర్టిఫికెట్లను పరిశీలిస్తామని, విద్యార్థులు బుక్ చేసుకున్న స్లాట్ సమయానికి సెంటర్‌కు వెళ్లి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. విద్యార్థులు tgecet.nic.in website ద్వారా ఆప్షన్స్‌ను 14వ తేదీ వరకు ఇచ్చుకోవచ్చన్నారు. సోమవారం 445 మంది అభ్యర్థులు తమ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వచ్చారని ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ తెలిపారు. కాలేజీ విభాగాధిపతులు ఈగ మల్లికార్జున్, గన్ను నటరాజశేఖర్, రామకృష్ణ, క్యాంప్ అధికారి ప్రభాకర్ ఉన్నారు.

## రూ.120 కోట్ల స్మార్ట్‌సిటీ పనులకు టెండర్లు

వరంగల్, జూన్ 10 : గ్రేటర్ పరిధిలో స్మార్ట్ సిటీ పనులకు టెండర్ ప్రక్రయ చేపట్టారు. సోమవారం హైదరాబాద్‌లో స్మార్ట్‌సిటీ బోర్డు కమిటీ సమావేశం జరిగింది. రూ.120 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు టెండర్లు నిర్వహించారు. స్మార్ట్‌సిటీ బోర్డు కమిటీ సభ్యులు ఈఎన్‌సీ జియావుద్దీన్, సీడీఎంఏ దివ్య, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర పాల్గొన్నారు.



స్మార్ట్‌సిటి బోర్డు సమావేశంలో పాల్గొన్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

## తిను బండారాలు నిల్వ చేసిన గోదాం సీజ్

### 'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

చెన్నారావుపేట, జూన్ 10 : అనుమతులు లేకుండా తినుబండారాల వ్యాపారం చేస్తే చర్యలు తప్పవని వరంగల్ ఫుడ్ సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి అన్నారు. నాసిరకం తినుబండారాలు, అక్రమ నిల్వలపై ఆదివారం నమస్తే తెలంగాణ పత్రికలో వచ్చిన 'ప్రజల ప్రాణాలతో చెలగాటం' అనే కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. సోమవారం చెన్నారావుపేట మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామంలో పాపడాలు, అప్పడాలు నిల్వ చేసిన గోదాంలో తనిఖీలు నిర్వహించారు. సదరు వ్యాపారి అందుబాటులో లేకపోవడంతో గోదాం, తయారీ కేంద్రాన్ని సీజ్ చేశారు. నిల్వలను పరీక్షా కేంద్రానికి పంపి వచ్చిన రిపోర్టు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని కృష్ణమూర్తి తెలిపారు.

## ఐటీఐ ప్రవేశాల గడువు 14 వరకు పొడిగింపు

### వరంగల్ ఐటీఐ ప్రిన్సిపాల్ జుమ్లానాయక్

హనుమకొండ చౌరస్తా, జూన్ 10 : ఐటీఐల్లో ప్రవేశాలకు ఈ నెల 14 వరకు దరఖాస్తుల గడువును పొడిగించినట్లు వరంగల్ బాలుర ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జుమ్లానాయక్ తెలిపారు. అభ్యర్థులు iti.telangana.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని, ఒరిజినల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలన్నారు.

## మార్నేనికి నందనం సొసైటీ డైరెక్టర్ల అభినందన

ఐనవోలు, జూన్ 10 : తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్‌గా ఎన్నికైన మార్నేని రవీందర్‌రావును సోమవారం నందనం సొసైటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, సీఈవోలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఐనవోలు మండల ప్రజాప్రతినిధులు, మండల వాసులు కూడా మార్నేని రవీందర్‌రావును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రవీందర్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నందనం సొసైటీ సభ్యులు

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

శాయంపేట జూన్ 10 : పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బీఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు పొడిశెట్టి గణేశ్ తల్లి రాజేశ్వరి అనారోగ్యంతో మరణించగా, సిరికొండ ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సిరికొండ యువసేన జిల్లా నాయకుడు రాకేశ్ ఉన్నారు.

## 1 నుంచి పీజీ సెమిస్టర్ పరీక్షలు

హనుమకొండ చౌరస్తా, జూన్ 10 : కేయూ పరిధిలో పీజీ సెకండియర్ సెకండ్ సెమిస్టర్ పరీక్షలు జూలై 1 నుంచి ఉంటాయని పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి తెలిపారు. మొదటి పేపర్ 1వ, రెండోవది 3న, మూడోవది 5న, నాలుగోవది 8న, ఐదోవది 10న, ఆరో పేపర్ 12న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

## మిషనరీ ఆస్తులను పరిరక్షించాలి

హనుమకొండ రస్తా, జూన్ 10 : హనుమకొండ పొలసమాజం పరిధిలోని మిషనరీ ఆస్తులను పరిరక్షించాలని ఫీల్డ్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు బాప్టిస్టు చర్చిలు హనుమకొండ ప్రాపర్టీస్ చైర్మన్ కొల్లూరి మార్టిన్ లూథర్ కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయనతో పాటు ప్రాపర్టీస్ ప్రతినిధులు మేకల డానియల్, పాస్టర్ జన్ను ఏసన్న మాట్లాడారు. ప్రాపర్టీస్ ప్రతినిధులు పుల్లా ఇమ్మాన్యుయేల్, దామెర జేమ్స్, తీగల మోహన్, డీఎస్ ప్రభాకర్, జేమ్స్ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

వరంగల్, జూన్ 10 : వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో పాఠశాల బస్సుల యాజమానులు, డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వడుప్సా జిల్లా అధ్యక్షుడు మాదాల సతీశ్‌కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి వేణుగోపాల్, వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కిశోర్‌బాబు, వడుప్సా ప్రతినిధులు జ్ఞానేశ్వర్, రాంబాబు, శ్రీకాంత్‌రెడ్డి, ఫరూక్, తీగల శ్రీధర్, మండ శ్రీనివాస్, గూడెపు రవీందర్, ముక్తీశ్వర్, జెన్నారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు పట్టించుకోక బతుకు భారమై..

- కాళ్లు పడిపోయి అచేతన స్థితిలో నాగరాజు
- బాగోగులు చూడని కుమారులు, కుమార్తె
- స్నేహితుడికి ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు
- సాయం చేయాలని బాధితుడి వేడుకోలు

వేలేరు, జూన్ 10 : డిస్క్ సమస్యలతో రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎటు పోవాలన్న వీల్ చైరే దిక్కు. కర్ర సాయంతోనూ నడవలేని పరిస్థితి దామెర నాగరాజుది. దీనికి తోడు మానసిక వేదనతో రోజురోజుకూ క్షీణిస్తున్న ఆరోగ్యం. పట్టించుకునే వారు లేక నానా ఇబ్బందులు పడుతూ జీవితం సాగిస్తున్నాడు. మండలంలోని శాలపల్లికి చెందిన నాగరాజుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పాల వ్యాపారం చేస్తూ జీవిస్తుండగా భార్య భారతి ఆర్థిక కారణాలతో 2007లో ఆత్మహత్య చేసుకున్నది. అప్పటి నుంచి ఆయన పిల్లలు కడిపికొండలోని వారి అమ్మమ్మ వద్ద ఉంటూ చదువుకున్నారు. కాగా, అప్పటికే కీళ్ల నొప్పులతో నాగరాజు బాధపడుతుండగా, 2017లో డిస్క్ సమస్యలతో రెండు కాళ్లు పూర్తిగా పడిపోయాయి. శాలపల్లిలో ఉన్న 15 గుంటల భూమి అమ్మి, సుమారు రూ.12లక్షలు దాకా ఖర్చు చేసి వైద్యం అందించినా ఫలితం లేకుండా పోయింది. కనీసం నడవలేని స్థితిలో ఉన్న నాగరాజు బాగోగులు అతడి తల్లి ఉప్పలమ్మే చూసుకునేది. అయితే 9 నెలల క్రితం ఉప్పలమ్మ అనారోగ్యంతో చనిపోయింది. అప్పటి నుంచి నాగరాజు ఒంటరి వాడయ్యాడు. ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. కూతురు చదువుకుంటోంది. నడవలేని స్థితిలో ఉన్న తండ్రిని కొడుకులు కనీసం పట్టించుకోవడం లేదు. శాలపల్లిలో ఉన్న పూరి గుడిసె అతడికి దిక్కయింది. నాగరాజు టెన్త్ మిత్రులే అండగా నిలుస్తున్నారు. నాగరాజుకు వీల్‌చైర్ అందించి, పూరి గుడిసెపై టార్పాలిన్ కవర్ వేయించారు. వైద్య ఖర్చుల కోసం రూ.2 లక్షల వరకు ఇచ్చారు. ఇప్పటికీ సాయంగా ఉంటున్నారు. అయితే తాను ఈ పరిస్థితిలో ఉన్నా తన పిల్లలు పట్టించుకోవడం లేదని, కనీసం ఫోన్ చేసి బాగోగులు అడగడం లేదని నాగరాజు కన్నీటి పర్యంతమయ్యాడు. కనీసం ప్రభుత్వమైన ఆదుకోవాలని, ఉండడానికి ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్నాడు.





బాధితుడు నాగరాజు, అతడి పూరి గుడిసె



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### గ్రీవెన్స్‌లో హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, జూన్ 10 : ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ సిక్తా పట్నయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రీవెన్స్ దరఖాస్తులను పెండింగ్ పెట్టకుండా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలపై 111 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో జీడబ్ల్యూఎంసీకి సంబంధించి 17, ఆర్‌డీవోల 6, విద్యా శాఖ 5, డీపీవో 3, ఏడీ సర్వేల్యాండ్ శాఖ 2, వైద్యారోగ్య 2, మిగిలినవి ఇతర శాఖలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి. కార్యక్రమంలో డీఆర్డీవో నాగపద్మజ, డీఎంహెచ్‌వో సాంబశివరావు, జడ్పీ సీఈవో వేదవతి, ఇండస్ట్రీస్ జీఎం హరిప్రసాద్, జిల్లా సంక్షేమాధికారి మధురిమ, సోషల్ వెల్ఫేర్ అధికారి నిర్మల, బీసీ వెల్ఫేర్ అధికారి రాంరెడ్డి, టూరిజం అధికారి శివాజీ పాల్గొన్నారు.

### జర్నలిస్టుల సొసైటీ స్థల పరిరక్షణకు చర్యలు..

కాజీపేట : దర్గా కాజీపేట శివారులోని సర్వే నంబర్ 27లోని కాకతీయ జర్నలిస్టు కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి ప్రభుత్వం కేటాయించిన 4. 20 ఎకరాల భూమిలో అక్రమణలు తొలగించి స్థలాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టర్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కాకతీయ జర్నలిస్టు కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, కార్యదర్శి సోమనర్సయ్య, ఉపాధ్యక్షుడు రమేశ్ బాబు, డైరెక్టర్ దయాసాగర్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

### ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి..

వేలేరు : ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. మండలంలోని ఎర్రబెల్లి నుంచి హనుమకొండ వరకు బస్సు సర్వీసును ఆమె ప్రారంభించారు. ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం వసంత, డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ, తహసీల్దార్ కొమి పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డ్ ఆత్మహత్య

ఖిలావరంగల్, జూన్10 : కుటుంబ సమస్యలతో ఓ సెక్యూరిటీ గార్డు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం అర్ధరాత్రి వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్ల మధ్య జరిగింది. వరంగల్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ కాపువాడకు చెందిన నాగపురి నిఖిలేశ్(34) మెడికవర్ దవాఖానలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెంది హంటర్‌రోడ్డులోని మినీ అండర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### చెదల మందు తాగి యువకుడు..

కాశీబుగ్గ : నగరంలోని రామన్నపేటకు చెందిన ఓ యువకుడు చెదలు మందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మట్టెవాడ పోలీసుల కథనం ప్రకారం.. రామన్నపేటకు చెందిన మంచాల శ్రీకాంత్(34) పెయింటింగ్ పని చేసేవాడు. అతడికి ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి మద్యానికి బానిస కావడంతో భార్య వదిలిపెట్టి వెళ్లింది. మద్యం సేవిస్తూ అనారోగ్యానికి గురయ్యాడు. గత నెల 20న మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని ఇంట్లో ఉన్న చెదల మందు తాగితే కక్కించారు. అప్పటి నుంచి తన పనులు చేసుకుంటున్నాడు. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా విరోచనాలు కావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు.

### మద్యం తాగొద్దన్నందుకు మనస్తాపంతో..

పరకాల (నడికూడ) : జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయపర్తిలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెలుమల్ల సాంబరెడ్డి (59) షుగర్, బీపీ వ్యాధులతో బాధపడుతున్నాడు. ఓ పక్క మందులు వాడుతూనే మద్యం తాగేవాడు. ఈ నెల 9న సాంబరెడ్డి మద్యం తాగగా, కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో సోమవారం గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. భార్య సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రవిరాజు తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

హసన్‌పర్తి : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. సీఐ సురేశ్ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా గుడ్లసింగారానికి చెందిన సముద్రాల శ్రవణ్‌కుమార్(40) ఆదివారం నాగారంలోని ఫ్రెండ్ వద్దకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి బైక్‌పై వెళ్లాడు. కొద్ది గంటల తర్వాత కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం నాగారం వెళ్లే మార్గమధ్యంలోని మిలినియం స్కూల్ వద్ద పొలంలో అతడి మృతదేహం కనిపించింది. కేసు సమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## నాటు సారా పట్టివేత

పర్వతగిరి, జూన్ 10 : మండల కేంద్రంలోని చౌరస్తాలో విక్రయిస్తున్న 36 లీటర్ల నాటుసారాను పట్టుకుని సోమవారం సీజ్ చేసినట్లు ఎస్సై జీ వెంకన్న తెలిపారు. నెక్కొండ మండలం మైబు నాయక్ తండాకు చెందిన బానోత్ లక్ష్మి, తారమ్మ, రూప్లి, పున్నమ్మ, విజయ, వీరమ్మలపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ వివరించారు.



నియామక పత్రాలను అందిస్తున్న చైర్మన్ తిరుమల్‌రావు

## ఎస్వీఎస్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

### ఉద్యోగాలకు పలువురు విద్యార్థుల ఎంపిక

హసన్‌పర్తి, జూన్ 10 : భీమారంలోని ఎస్వీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో బెంగళూర్‌కు చెందిన డెక్స్‌టెరిటీ కంపెనీ సోమవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఇందులో కళాశాలలోని ఈఈఈ, మెకానిక్ బ్యాంచ్‌లలో చివరి సంవత్సరం చదువుతున్న 13 మంది విద్యార్థులు రూ.6లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఎస్వీఎస్ కళాశాల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు తెలిపారు. అనంతరం ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేసి, అభినందించారు. అలాగే, రానున్న రోజుల్లో మరిన్ని కంపెనీలు రావడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా ఈసెట్ విద్యార్థులకు ఉచిత కౌన్సిలింగ్, ఆప్షన్స్ ఇవ్వడానికి ఎస్వీఎస్ హెల్ప్ లైన్ నంబర్ 9391949237లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.